ఒకరు ఇష్టపడేవారికి వేరొకరు దగ్గరవుతుంటే పుట్టే ఈర్ష్య, అసూయలను జయించడం ఎంతో కష్టమైన పని. ద్వాపరంలో సత్యభామ... మరికొందరు గోపికలూ ఇలాంటి పరిస్థితి అనుభవించారని అంటుంటారు. ఇప్పుడు అలాంటి సందర్భాన్నీ, ఆనాటి మనిషినీ- ఈ కాలానికీ, ఇప్పటి పరిస్థితులకూ అన్వయించి చెబితే ఎలా ఉంటుందన్నదే ఈ కథ.

కుప్పిలి సుదర్శన్

# 3 అనుత్తర





"చార్లీ.. నీ నవ్వు మొహం పక్కన పెట్టి ఏదైనా కొత్త సంగతి చెప్పు..." ఎదుటి గోడమీద తైలవర్ణ చిత్రంలో వెనక్కి తిరిగి కూర్చున్న కన్నయ్య వేణువూదడం ఆపి అడిగాడు.

"ఈ చిత్రపటంలోకి నన్ను పిలిచి నువ్వో విషయం చెప్పావు. చాలా ఏళ్లయింది... ఆ సంగతి చెప్పొచ్చుగా. ద్వాపరయుగంలో బాకీపడ్డ బాధ... ఎప్పుడు అనుభవిస్తావ్?" చార్లీ చాప్లిన్ గెటప్‌లో తనను తాను సర్దుకుంటూ చేతనుడు విసుక్కున్నాడు.

"అరే... బాధ అనుభవించడం అంటావేం... ఒకరు మరొకరిలా ఉండటం అంటే బాధా?"

"ఏమో... నువ్వు బాధపడతావనే నాకు అనిపిస్తోంది. బృందా వనంలో వేలగోపికలను ఆనంద డోలికల్లో విహరింపజేశావు. నువ్వు ఎవరి దగ్గరకి ముందు వస్తావో, ఎవరితో ఎక్కువసేపు ముచ్చటిస్తావోనని వాళ్లలో కొందరు ఈర్ష్యగా బాధపడ్డారు. ఆ వేలగోపెమ్మల్లో ఓ వెన్నెలమ్మ ఎంచక్కా 'ఆ ఈర్ష్యాయాతన నీకు తెలియదు... ఇది మానవ మాత్రులకే సొంతం. ఆ బాధ నువ్వు అనుభవించగలవా... ఓ మనిషిలా,' అని గోముగా అడిగితే, అదిగో ఇదిగో అని సమాధానాన్ని కలియుగానికి నడిపించావు."

"అవును... సమయం ఆసన్నమైంది. అనుత్తరకు సమాధాన మివ్వాలి."

"ఓహో... సరేగానీ... ఆమెతో కేవలం ఓ మనిషిలా మాత్రమే నువ్వు ప్రవర్తించాలి కదా... చాలా కష్టమయ్యా. నాకు మనిషి శక్తి మీదా, ఆలోచనల మీదా- నమ్మకమూ అపనమ్మకమూ సగం సగం. నా దృష్టిలో ఇప్పుడు నీ ప్రయత్నం ఓ యుద్ధం."

"చూద్దాం... కథ నడిపే బాధ్యత నీదే."

"సరే... నీ వేణువులో వాట్సప్‌కి రేపు సందేశం వస్తుంది. నీ శక్తి మానవమాత్రం, నీ దైవత్వం ఇక నా చిత్రపటంలో నిక్షిప్తం." వెన్నుడు వెన్ను జూపుతూ కరకు చీకటిని కరిగించే కొత్త రాగమేదో ఆలపించాడు.

రాత్రయింది.

❖

‘‘ఏళ్ల తరబడి కోర్టు కేసుల్లో మగ్గిపోయిన బంగ్లా సార్ ఇది. గట్టిగానే ఉంది. రంగులు వేయించడానికి కూడా నాకు స్తోమత చాలదు. త్వరగా మంచి బేరం చూడండి సార్...’ ఫోన్ కట్ చేసి గేటు తెరుచుకుని లోపలికి వచ్చింది అనుత్తర.

ఓ మూడు గంటల్లో బంగ్లా పైనున్న గదిని శుభ్రం చేసుకుంది. చకచకా నాలుగు ఫొటోలు తీసి మ్యూజిక్ లవర్స్ వాట్సప్ గ్రూప్‌లో షేర్ చేసింది. గోడల మీద సంగీత వాయిద్యాల బొమ్మలుండటమే దానికి కారణం.

‘‘కన్నయ్యా... నీకు సందేశం వచ్చింది చూడు...’’ చార్లీ ఉత్సాహంగా అన్నాడు.

కన్నయ్య వేణువూదగానే స్వరాల తెరపై అనుత్తర షేర్ చేసిన ఫొటోలు కనపడ్డాయ్.

‘‘చార్లీ... వీటిల్లో నీ ఫొటో బాగుంది. తన ప్రొఫైల్ పిక్ లేదు... ఎలా ఉంది తను? నేను ఈ చిత్రంలో వెనక్కి తిరిగి ఉండటం వల్ల ఏదో చట్రంలో ఇరుక్కున్నట్లు ఉంది.’’

‘‘అనుత్తర గురించి నేనేమీ చెప్పకూడదు. నువ్వు మనిషిలా ఉండాలిగా... కులం, మతం, జాతి, రంగు, ధనిక, పేద... ఇంకా చాలా చట్రాలున్నాయి కదా మనుషుల్లో. నీకు ఈ చిత్తరువే చట్రం. నీ నల్లని ఛాయ నచ్చి, ఆమె అనుమతి ఇస్తేనే నువ్వు ఆమెను చూడగలవు. అందాకా అజ్ఞాతమే. కేవలం అంతర్జాల సందేశమే అందించగలవు. ఏదైనా రాగం షేర్ చెయ్. మాటలు కలపచ్చు...’’

సరేనన్నాడు కన్నయ్య.

సాయంసంధ్య మీద వేకువ జాబిలి వేసిన వెన్నెల వారధిలాంటి వేణుగానం ఒకటి గ్రూప్‌లోకి పంపాడు.

❖

‘‘హాయ్ వేణు సార్.. నమస్తే.. నా పేరు అను. మీ ట్యూన్ చాలాచాలా బాగుంది. స్వీట్ ఫ్రీక్వెన్సీకి అడిక్ట్ అయిపోయా... కొత్త కొత్తగా ఉంది. ఆపకుండా ప్లే చేస్తూనే ఉన్నాను. పర్సనల్ చాట్‌కి ఏమీ అనుకోకండి. ఆ గ్రూప్‌లోకి కొత్తగా చేరారా...’’

‘‘అవునండీ... థాంక్స్...’’

‘‘మీదే వూరు? ఏం చేస్తుంటారు?’’

“గోపాలపురం... పిల్లంగోవి, జానపదాలు, ఆలమందలు... అంతేనండీ నా జీవితం. మీరు?”

“నా గురించి అంత చెప్పేందుకు ఏమీ లేదులెండి... అనుపమానం కాని అను...”

“అయితే నేను రెండు విషయాలు ఎక్కువ చెప్పాననుకుంటా...”

“హహ... నేనో కోరస్ సింగర్. పిల్లలకు సంగీతం నేర్పిస్తుంటా... అలా అలా... జీవితం... ఇంకేమీ అడక్కండి...”

“ఆహా... అయితే మీ దగ్గర మంచి పాటలు వినొచ్చన్నమాట!”

“అంత లేదులెండి... పదేళ్లుగా బృందగానంలో బందీగా ఉండిపోయా... బయటపడేసే భగవంతుడు ఎదురవలేదు.”

“ఉట్టి కట్టి పెట్టండి... కృష్ణుడు వస్తాడేమో...”

“భలే చెప్పారు.. కొత్త ఇంట్లో ఈ ప్రయోగం చేస్తాలెండి... ఆపరేషన్ వెన్నముద్ద! హహ...”

“శుభం... అసలిప్పుడు ఎవ్వరి ఇళ్లల్లోనూ వెన్నముద్దలు లేవని కృష్ణుడు ఖాళీగా ఉన్నాడట కూడా... మనలో మాటలెండి...”

“హమ్మో... మీతో మాట్లాడుతుంటే టైం తెలీడంలే... పన్నెండైంది. రేపు రికార్డింగ్ ఉంది... గుడ్ నైట్ సర్.”

“శయనకీర్తనాస్వప్నప్రాప్తిరస్తు!”

“బాబోయ్.. ఇలా కూడా గుడ్ నైట్ చెప్తారా?!”

కన్నయ్య తనలో తాను నవ్వుకుని, అనుత్తర కోసం ద్వాపరంలో వెదుకులాటకు ప్రయత్నించాడు.

❖

“చార్లీ... నాకు అనుత్తరను చూడాలని ఉంది.”

“అడగాల్సింది... ప్రొఫైల్ పిక్ లేదేం అని...”

“ఎందుకో... అలా అడగాలనిపించలేదు. ఎందుకంటావ్?”

“ఓ... అవును... నీలో ఇప్పుడు మానవనైజం ఉంది కదా...”

“హా... ఆలోచనలు కూడా ద్వాపరానికి వెళ్లలేకపోతున్నాయి. సరే... తనిప్పుడు ఏంచేస్తోంది? రెండు రోజులైంది తను. సందేశం పంపి...”

“అలా చెప్పడం సృష్టి విరుద్ధం...”

“ఓ.. నువ్వు దేవుడివి కదూ... చెప్పొద్దులే.”

"నీవు నేర్పిన విద్యయే నీరజాక్షా..."

❖

"హలో సార్... ఏమైపోయారు...? కనీసం గుడ్ మాణింగ్ కూడా లేదు..."

"మీరసలు కనిపిస్తేగా..."

"కనిపించకపోతే... గుడ్ మాణింగ్ చెప్పరా...? ఊహూం... అదేం కుదరదు... రోజూ చెప్పాల్సిందే... నేను చెప్పకపోయినా సరే... ఓకేనా... ఇంతకీ ఏంచేశారు ప్రశాంతంగా ఈ రెండ్రోజులూ?"

"సారీ అండీ... ఓ పిచ్చిరాగం ఇబ్బంది పెట్టిందండీ పాట కొలిక్కిరాడానికి..."

"ముందు 'అండీ' అనడం ఆపండి... చిరాగ్గా ఉంది. ఆ పాట పంపుతారా?"

"ఓకే... పంపుతా..."

❖

"కన్నయ్యా... పాట పంపించి, బదులుగా ఫొటో అడుగుతావా?"

"ఆఁ... అలాగే అడగాలి చార్లీ. వేరే దారి లేదు తనని చూడటానికి... తను అభిమానించడం చూస్తుంటే తనకు ద్వాపరం గుర్తొచ్చేలా అనిపించట్లేదూ?"

"ఏమో నరోత్తమా... ఈ ద్వాపర మిత్రుడిని పిలిపించుకుని, ఈ చార్లీచాప్లిన్ చిత్రంలో కూర్చోబెట్టి, అంతా నీవే చేస్తూ... అనుత్తర విషయం నన్నడుగుతావేం..."

❖

అది జతి సడలి వేకువకు తొలిజాము చేరువైన వేళ.

"మీ వేణువు వింటే భయమేస్తోంది, నాకేదో అవుతుందేమో అని. ఆ ట్యూన్ నేనెప్పుడో పాడిన పాట అనిపిస్తోంది. కొన్ని గమకాలకు కళ్లు చెమర్చుతున్నాయ్. ఎందుకీ రాగం విన్నానా అనిపిస్తోంది. మనసంతా భారంగా ఉంది. శుద్ధధన్యాసి కదూ... ఊ... ఈ పాట వింటే వేణువే మీ హృదయమేమో అనిపిస్తోంది. మీరు నమ్మరుగానీ, అది నాతో మాట్లాడుతోంది... మీకంటే బాగా...! ఏంటీ పిచ్చి మెసేజ్, పరిచయం అయిన రెండ్రోజులకే ఇలా మాట్లాడుతోందేంటీ అనుకుంటున్నారా? నేనింతే... ఏదిష్టమైనా విపరీతంగా అభిమానిస్తా. థ్యాంక్స్ ఫర్ యువర్ సాంగ్..."

"థ్యాంక్స్ కాదు... తమరి పిక్ పెట్టండి. లేకపోతే ఏదో అపరిచితులతో మాట్లాడినట్లు ఉంటుంది."

"హలో సార్.. అమ్మాయిల్ని ఇలా ఫొటోలు అడగటం మేనర్స్ కాదు... అయినా నేనేం అందంగా ఉండన్లెండి..."

"మహాశయా... ఏమైపోయారు... ఆన్‌లైన్లోనే ఉన్నారుగా..."

"... ... ..."

"ఏంటి? మాట్లాడరా... మానేయండి... మీ ఇష్టం."

కన్నయ్య కళ్లల్లో వెన్నెల మసకేసింది.

❖

"చార్లీ.. తనేంటి అలా మాట్లాడుతోంది? కేవలం చూడాలని అనుకోవడం తప్పా?"

"తన ఉద్దేశం... స్నేహానుబంధాలకు రూపంతో ఏం పని అని. నల్లనివాడవు... నీకు తెలియంది కాదుగా ఆ విషయం..."

"అయినా... ఊరికే తెగే వరకూ కోరికల్ని సాగదీస్తారెందుకు మనుషులు? తర్వాత తెగిన కోర్కెల్ని కన్నీళ్లతో అతికించుకుంటూ మళ్లీ గుండెల్లోకి దాచుకోవడం - ఎంత కష్టం?"

"ఓహో... మొదలైందయ్యా నీ బాధ."

❖

వానాకాలంలోనూ ఉదయకిరణాలు అనుత్తర రంగవల్లికను ముద్దాడి మూడు రోజులు కాపుగాశాయి.

"మీకు చాలా పొగరు... అలిగింది చాలు... పిక్ పెట్టాను. అసలు ఆన్‌లైన్‌లో బండలా అలా ఎలా ఉంటారండీ మీరు? ఐ హేట్ యూ..."

"చూశాను... ఎవరిదిది?"

"నాదే... చిన్నప్పటిది... బాగుందా?"

"బాగుంది..."

"చెప్పడం మర్చిపోయా... ఈ నెలాఖర్లో రాకేశ్ ఆల్బమ్ రిలీజ్ ఉంది. గ్రూప్‌లో కొత్తగా చేరాడు... తెలుసుగా..."

"హా... బాగా పాడతాడు కూడా..."

"... ..."

"ఉన్నావా..."

"యా... కొంచెం బిజీ..."

కన్నయ్య పరిచయగీతానికి ప్రతిరోజు ఒక కొత్త చరణం జత కలుస్తోంది. అనుత్తరను చూడాలన్న కోరిక మాత్రం మళ్లీమళ్లీ చరణాల చివర పల్లవిలా వినిపిస్తోంది..

❖

“గుడ్ మాణింగ్... వేడివేడి ఇడ్లీలు... మీకోసమే... తినండి...”

“ఏంటి పదకొండింటికా... నిన్నా మొన్నా తమరి సందేశాలే లేవేం?”

“రాత్రి రాకేశ్ ఆల్బమ్ రిలీజైంది... రెండ్రోజులు రికార్డింగ్‌కి సాయంగా పిలిచాడు... ఆ పనిలో బిజీ... రాత్రి బాగా లేటైందని తనే డ్రాప్ చేశాడు...”

“నా తర్వాత పరిచయమైన రాకేశ్‌కే నువ్వు ముందు కనిపించావు కదా. నేను నిన్ను చూడటం ఇష్టం లేదా... లేదా నా మీద నమ్మకం లేదా అన్నది తెలియట్లే...”

“షటప్ అండ్ గెట్ లాస్ట్...”

❖

“కన్నయ్యా... అనుత్తర గురించి ఇప్పుడేమనుకుంటున్నావ్? తను నీ గురించి ఏమనుకుంటుందో ఏమన్నా ఊహించావా?”

“నన్నేమీ అడగొద్దు చార్లీ. మనిషిలా ఉన్నాను కదా... తనని చూడాలన్న విషయమే విషమం అయిపోయింది చూడు. మాటొక్కటే తీపి... మనసు మంత్ర తంత్రి... చీకట్లోకి నెట్టేసింది తను... ఒకవేళ... తిరిగి రాకపోతే... పిచ్చి పట్టినట్లు ఎందుకిలా అనిపిస్తోంది నాకు...? ఇంకా నేను తనకు దగ్గరవ్వలేదు కదా...”

“ఇష్టమైనా కష్టమైనా ఎదురుచూపులు తప్పవు కన్నయ్యా... ఈ బాధను నీ జ్ఞాపకాల్లో అపురూపంగా దాచుకుంటావు... నువ్వు గెలవగలిగితే...”

“నా మాటకు గాయపడిందేమో... ఇక తను సందేశం ఇవ్వదనుకుంటా.”

❖

రోజులు ఘరానాల్లో గమకాల్లా దొర్లిపోతున్నాయ్. కన్నయ్య వేణువును ఆల మందతో కలిపి గాలికొదిలేశాడు. చార్లీ ముసుగున చేతనుడి మాటలకు చిరాకు పడుతున్నాడు. అతడి నవ్వు మొహం కన్నయ్యను గుచ్చుతోంది. అంతేకాదు... ఎదుటివాళ్ల ఆనందాలేవీ నచ్చట్లేదు... మొత్తం మీద అపస్వరాలకు భయపడి కన్నయ్య పాడటం మానేశాడు...

❖

“మీకు చాలా పొగరు. ఏదో గొడవపడితే అనుబంధాల్ని మధ్యలో వదిలేస్తారా? మీ గురించి చాలా ఎక్కువ ఊహించాను. ఐ హేట్ యూ...”

“నేనేం వదిలేయలేదు. నీకు కోపం తెప్పించాను. తప్పు నాదే కదా. మౌనంగా ఉండిపోయా.”

“మీకు ఏదో ఒక రోజు సడెన్‌గా కలుస్తా... సరేనా... లీవిట్. ఏదైనా జోక్ చెప్పండి. బోర్‌గా ఉంది.”

“నాకేం రావు. నీకో పాట పంపి నాలుగురోజులైంది. ఎలా ఉందో చెప్పలేదేం?”

“మూమూలుగా ఉంది...”

“... ...”

“ఏంచేస్తున్నారిప్పుడు?”

“పాలు పితకాలి. మళ్లీ కలుద్దాం...” కోపం కనిపించనివ్వకుండా జాగ్రత్తపడ్డాడు కన్నయ్య. పాట నచ్చకపోయేసరికి తనమీద తనకే జాలి, చీదరింపు కలిగాయి.

❖

“చార్లీ... తను కలవదు అనుకున్న ప్రతిసారి కలుస్తుంది. మళ్లీ ఎందుకిలా మాట్లాడుతుంది. నా ప్రవర్తన ఇబ్బందిగా ఉన్నా నాతో సర్దుకుపోయి ఉంటున్నట్లా? అయితే నాకు తను వద్దు. దగ్గరున్నప్పుడు ద్వేషించినట్లు, దూరమైనపుడు కాంక్షించి నట్లూ... రూపం తెలియకపోయినా ఏంటీ పరిస్థితి? ఎందుకీ చట్రంలో బందీ అయ్యానా అనిపిస్తుంది.”

“హహ... కన్నయ్యా, నీ ఎదుటివాళ్లు చేసే ప్రతి పనికీ కారణం నీకు తెలిస్తే నిన్ను మనిషి అనరు, దేవుడు అంటారు. నువ్విప్పుడది కాదుగా...”

❖

గదిలో గాంధర్వాలు ఓ వారం రాజ్యమేలాయి. కైశికి కాకలీలు నిరాశ నీడలు వెతికే పనిలో పడ్డాయి...

“హాయ్ ఏంచేస్తున్నారు?”

“ఏం లేదు. కొండమీద ఉన్నాను..”

“మనసేం బాలేదు. పిచ్చి ఆలోచనలు. మీతో మాట్లాడితే నాకు చాలా బాగుంటుంది తెల్సా. నాతో గొడవపడినా సర్దుకుపోయే మనిషి మీరొక్కరే.”

“ఇపుడేమైంది?”

“ఒక అమ్మాయి ఏదో సరదాగా మాటాడితే అబ్బాయిలు ఏమనుకుంటారు? ఎందుకు తక్కువగా ఆలోచిస్తారు? ఏడుపొచ్చేస్తోంది కొందరివల్ల...”

“వాళ్లలో నేనూ ఒకణ్ని కదా... సారీ.”

“అక్కర్లే... కాసేపు మూడ్ ఇలా ఉంటుంది. ఐ డోంట్ కేర్ దెమ్...”

“హేయ్... ఏంటి సడన్‌గా ప్రొఫైల్ పిక్ పెట్టావ్?”

“నా ఇష్టం మహానుభావా... ఇప్పుడు తీసేశా కూడా... హహ... శుభరాత్రి...”

❖

"చార్లీ... ఇంతకన్నా నన్ను చంపడం మేలు కదా. తను నిజంగా బృందావనంలో వరమడిగిన అనుత్తరేనా? కళ్లనిండా ఆమె రూపం, కన్నీళ్లలో మునిగి వివర్ణమవుతున్న స్థితిని దాటి వెళ్లలేకపోతున్నా..."

"భరిస్తానన్నావుగా..."

❖

తనవి కాని రాగాలు కన్నయ్యను ఊహాతీతుణ్ని చేసి ఎక్కడో వదిలేస్తున్నాయ్.

"హేయ్... మన గ్రూప్‌లో సంజయ్ అని యూట్యూబ్ సీరియల్స్ తీసే అబ్బాయ్ తెలుసుగా... తన వీడియో ఇరవై లక్షలమంది చూశారు. మూవీ ఆఫర్ వచ్చిందట... నిన్న ట్రీట్ ఇచ్చాడు..."

"ఓ.. గుడ్..."

"అంతే కాదు సార్.. అక్కడ రాకింగ్ మ్యూజిక్ డైరెక్టర్ జయేంద్ర పరిచయం అయ్యారు. నా గురించి చెప్పాను. నా పాట విన్నారు. గొంతు చాలాచాలా నచ్చిందంట. టచ్‌లో ఉండమన్నారు. తర్వాతి సినిమాలో కొత్త వాయిస్ కావాలంట...!!! ఫస్ట్ ఈ విషయం మీకే చెప్పాను తెల్సా..."

"అయితే ఇక తమరు చాలా బిజీ అయిపోతారన్నమాట..."

"... ... ..."

"హలో సార్..."

"... ..."

"...ఉన్నారా..."

"... ..."

"...మాట్లాడరా..."

❖

"కన్నయ్యా... ఈర్ష్య అసూయలు మనిషికి చాలా ఎక్కువ. గుర్తించావా?"

"అవును చార్లీ... ప్రేమానుబంధాలు కావాలనుకున్న చోట అవి మరింత మంట రేపుతాయి. అనుత్తర నాతో మాత్రమే ఉంటే బాగుణ్నని అనిపిస్తుంది. అసలింకా తన మనసులో నేను ఉన్నానో లేదో నాకే తెలియట్లేదు. పిచ్చి ప్రేమ అంటే ఇదా? దేవుడిలా ఉంటే ఇవేవీ తెలీవు చార్లీ, హృదయం చిదిగి వేణువులో అడ్డుపడి, రాగాలేవీ పాడనీయక... నరకం... తన ప్రేమ గెలవాలంటే..."

"అనుత్తర అడిగింది అది కాదుగా... నువ్వు ఓడి, ఆ బాధ భరించాలి..."

"లేదు, భరించే శక్తి ఇక నాకు లేదు. తన ధ్యాసలో ఉండటానికి భూమిని మోయాల్సినంత శక్తి కావాలి. తను నా దగ్గర లేనపుడు తన నిశ్వాసతోనే నేను బతకడం కష్టంగా ఉంది. నా వల్లకాదు... ఈ కన్నీళ్లను దాచుకోలేను... నాకొద్దివి..."

"అయితే దేవుడిలా ఆలోచించు... ఏం చేస్తావ్?"

"మొన్న ఆమె చేతులకు గోరింట పెట్టుకుని చూపించమన్నా! చూపించలేదు. అంటే నామీద ఏమంత ఇష్టం లేనట్లే. నేనిక ఆమెతో మాట్లాడను..."

"ఇంత చిన్న కారణమా?"

"నా కాలి బొటనవేలికి బాణం తగిలి ప్రాణం పోయిందంటే నమ్మలేదా అందరూ? ఇదీ అంతే..."

"సరేలే... ఏదేమైనా... మా మనుషుల ప్రేమలు గొప్పవి కదా కృష్ణా..."

"అవును చేతనా.. మనిషి ప్రేమ అంగీకరించబడటం గొప్ప. వేరొకరి నుంచి ప్రేమ పొందటం ఇంకా గొప్ప!"

రేపల్లెలో అనుత్తర కోరికకు వెన్నముద్దలో సమాధానం చూపిన కన్నయ్య, చేతనుడితో కలిసి ఆలమందతో ఇంటికి బయల్దేరాడు.

తడి కన్నులను తృప్తిగా లిప్తాడించి, కన్నయ్య వదిలేసిన వేణువును కడవలో వేసుకుని తననను సరించింది అనుత్తర.

*తెలుగు వెలుగు మాసపత్రిక*
*జనవరి 2017*

*



కుప్పిలి సుదర్శన్ 10 జూన్ 1983న శ్రీకాకుళం జిల్లా పాలకొండలో జన్మించారు. మొదటి కథ *మరణ భ్రమణం* 2013లో మహోదయ పక్షపత్రికలో అచ్చయింది. దాదాపు ఇరవై కథలు రాశారు. ప్రస్తుతం బాలభారతం పిల్లల మాసపత్రికలో పనిచేస్తున్నారు.

***చిరునామా:** సన్నాఫ్ కృష్ణారావు, దూబ వీధి, పాలకొండ పోస్ట్,*
*శ్రీకాకుళం జిల్లా - 532 440. ఫోన్: 9493290290*
**sudarshanproductions@gmail.com**